క్లుప్తంగా

నేడు దుప్పట్ల పంపిణీ

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెంలోని బీసీ బాలుర వసతి గృహంలో ఉన్న దాదాపు 100 మంది విద్యార్థులకు ఆదివారం సహిర ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేయనున్నట్లు సొసైటీ నిర్వాహకుడు ఎస్డానీ బాషా శనివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



కొడవలూరు: ప్రభుత్వం గర్భిణిలు, బాలింతలకు అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను మండలంలోని గండవరం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ జి.రోజ్‌మేరీ, హెచ్‌ఎస్ మేరీ ఎలిజిబెత్, హెచ్‌ఏ డి.నాగయ్య, ఏఎన్‌ఎం పి.మమత, అంగన్‌వాడీ కార్యకర్తలు షంషాద్, ప్రియదర్శిని, మమత, రాధిక, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు రామిరెడ్డి రాజేష్ రెడ్డి, నాయకుడు డేగా వినయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

108, 107 జీఓలను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

నెల్లూరు (టౌన్) : వైద్య విద్యలో 108, 107 జీఓలను వెంటనే రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు కోరారు. నెల్లూరు నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ జీఓల్లో పేర్కొన్న సెల్ఫ్ ఫైనాన్స్ విధానం అత్యంత ప్రమాదకరమన్నారు. ఇప్పటి వరకు వైద్యవిద్య పేదలకు అందుబాటులో లేదని, ఈ జీఓలు అమలైతే మధ్య తరగతి వర్గాలకు కూడా అందుబాటులో ఉండదన్నారు. ఈ జీఓల్లో జనరల్ కేటగిరి, సెల్ఫ్ ఫైనాన్స్ కేటగిరి, ఎన్‌ఆర్‌ఐ కేటగిరిగా విభజించారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రిజర్వేషన్లు అమలయ్యే పరిస్థితులు కనిపించడం లేదన్నారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాలాజీ, నరేంద్ర, అశ్విన్, కిరణ్, నాయకులు పవన్, విజయ్, సుకుమార్, కిరణ్, సుమంత్, ప్రియ తదితరులు పాల్గొన్నారు.


చేనేతల ర్యాలీని జయప్రదం చేద్దాం



మాట్లాడుతున్న చేనేతల ఐక్య కార్యాచరణ కమిటీ నేతలు

నెల్లూరు(మినీబైపాస్) : జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీ చేపట్టనున్న భారీ ర్యాలీని జయప్రదం చేయాలని ఆ కమిటీ నాయకులు బుధవారపు బాలాజీ, ఆశం సురేష్ పిలుపునిచ్చారు. నెల్లూరు నగరంలోని లస్సీ సెంటర్‌లో ఉన్న చేనేత కార్యాలయంలో శనివారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. భారీ ర్యాలీలో భాగంగా తొలుత చేనేత కార్మికులు కలిసి స్థానిక వీఆర్సీ సెంటర్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తామన్నారు. అనంతరం చేనేత వస్త్రాలు ధరించండి, చేనేతను కాపాడండి అనే నినాదంతో ర్యాలీగా గాంధీబొమ్మ సెంటర్ చేరుకుంటామన్నారు. అక్కడ గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తామన్నారు. ఈ ర్యాలీలో ప్రతి చేనేత కార్మికుడు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో చొప్పరం మల్లికార్జున, తాళ్ల నరసింహ, స్వామి సోమగోపాల్, ఎర్ర ధనుంజయ, కన్నా బ్రహ్మయ్య, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారం



నెల్లూరు(పొగతోట): జగనన్నకు చెబుదాం ద్వారా వస్తున్న వినతులను సత్వరమే పరిష్కరించాలని డీపీఓ సుస్మితారెడ్డి ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం నుంచి డీఎల్‌పీఓలు, ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులతో శనివారం నిర్వహించిన వెబ్ కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. జగనన్నకు చెబుదాంలో వివిధ సమస్యలపై అర్జీలను ప్రజలు సమర్పిస్తున్నారని, వీటిని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య మెరుగునకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అన్నివర్గాల అభ్యున్నతికి సీఎం కృషి

• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. కోవూరులోని సచివాలయం–1 పరిధిలో శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాల బుక్‌లెట్‌ను అందజేసి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు కోవూరు నియోజకవర్గంలోని 78 సచివాలయాల పరిధిలో 90,821 గడపలకు వెళ్లి ప్రజలతో మమేకమయ్యామని తెలిపారు. ఏ గడపకు వెళ్లినా ప్రజలు తమను ఎంతో ఆదరిస్తున్నారని, అందుకు కారణం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పాలన, అభివృద్ధి కార్యక్రమాలేనని తెలిపారు. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. సంక్షేమ ప్రభుత్వానికి అందరూ మద్దతుగా నిలవాలని కోరారు. ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ ఫలాలను అందిస్తుంటే టీడీపీ నాయకులు ఓర్వలేక పోతున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఏ ప్రభుత్వ పథకం వర్తించాలన్నా జన్మభూమి కమిటీ సభ్యులు సిఫార్సు చేస్తేనే మంజూరయ్యేవని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలిపారు. ఏవైనా చిన్న చిన్న కారణాలతో ఎవరికైనా పథకాలు అందకపోతే వెంటనే తెలియజేయాలని, అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, మండల ఉపాధ్యక్షుడు నర్సింహులురెడ్డి, సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు జోత్స్న, శ్రీధర్, చిరంజీవి, సచివాలయాల కన్వీనర్ ప్రసాద్, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీ మంజూరు

ఇందుకూరుపేట మండలం నరసాపురం గ్రామంలో నూతనంగా జూనియర్ కాలేజీ(కో ఎడ్యుకేషన్) మంజూరైందని ఎమ్మెల్యే తెలిపారు. కొత్తగా ఏర్పాటయ్యే ఈ కళాశాల పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

దిగజారుతున్న నిమ్మధరలు



యార్డుకు వచ్చిన నిమ్మకాయలు

పొదలకూరు: సాధారణంగా ఆగస్టు నెలలో నిమ్మకాయల ధరలు తగ్గుముఖం పడుతుంటాయి. అయితే ఉన్న ధరలు కూడా దిగజారుతున్నాయి. గతేడాది ఇదే సీజన్లో బస్తా కాయలు రూ.4 వేల వరకు ధర పలికాయి. ఇప్పుడు రూ.2 వేలు కూడా పలకడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం కిలో నిమ్మకాయల ధర రూ.15 నుంచి రూ.25 మాత్రమే పలుకుతోంది. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో కాయల దిగుబడి ఆశించిన స్థాయిలో ఉండడంతో రైతులు ఆర్థికంగా బలపడ్డారు. ప్రస్తుతం ధరలు లేకపోగా తగ్గుతున్నాయని రైతులు వాపోతున్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం



బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న పీడీ సుజన

కోవూరు: తల్లిపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ పీడీ సుజన అన్నారు. మండలంలోని వేగూరు అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి పాలలో వ్యాధినిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని, పుట్టిన బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు పట్టించాలని తెలిపారు. తల్లిపాల వారోత్సవాలు ఈ నెల 7వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ జ్యోతి, సూపర్‌వైజర్లు రాధిక, ప్రసన్న, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలి



ఆటో యూనియన్ నాయకులతో మాట్లాడుతున్న సీఐ సంగమేశ్వరావు

మనుబోలు: ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సీఐ సంగమేశ్వరావు సూచించారు. మనుబోలులోని పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి ఆటో నడపడం నేరమన్నారు. అలాగే పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించరాదని, డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై అజయ్‌కుమార్, ఆటో యూనియన్ గౌరవాధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

నేడు ముత్తుకూరుకు మంత్రి కాకాణి రాక

ముత్తుకూరు: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం ముత్తుకూరుకు రానున్నట్లు వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నడవడి ముత్యంగౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లో జరిగే బహిరంగసభలో మంత్రి పాల్గొంటారని తెలిపారు.

మెట్టపొలాల్లో జలకళ బోర్లు



రైతు పొలంలో బోరు వేస్తున్న దృశ్యం

పొదలకూరు : మండలంలోని చెన్నారెడ్డిపల్లి గ్రామంలో రైతుల మెట్టపొలాల్లో వైఎస్సార్ జలకళ బోర్లు ముమ్మరంగా వేస్తున్నారు. ఈ గ్రామానికి 40 బోర్లను మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంజూరు చేయించారు. నీటిపారుదలకు అవకాశం లేని రైతులు గతంలో దరఖాస్తు చేసుకుని ఉండడంతో రెండు యంత్రాలు నిమ్మతోటలు, పొలాల్లో బోర్లు వేస్తున్నాయి. భూగర్భజలాలు బాగా ఉండడంతో వేసిన ప్రతి బోరులో నీరు పడుతున్నట్టు రైతులు వెల్లడించారు.

7న చేనేతల ధర్నా



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నెల్లూరు(వేదాయపాళెం) : జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 7వ తేదీన నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఉదయం 10 గంటలకు ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ కటికాల వెంకటేశ్వర్లు తెలిపారు. నెల్లూరు నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న రామచంద్రారెడ్డి భవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత పరిశ్రమపై విధించిన జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వ జీవిత బీమా, ఆరోగ్య బీమాలను పునరుద్ధరించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని, చేనేత కార్మికుల వెల్ఫేర్ ఫండ్ బోర్డు ఏర్పాటు చేయాలని, వైఎస్సార్ నేతన్న నేస్తం అర్హులందరికీ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నాయకులు పముజుల హరి, చేనేత కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

'వార్డు నంబర్–54' ఆడియో లాంచ్ నేడు

• సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ రాక



చిత్ర బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అమరావతి కృష్ణారెడ్డి, దర్శకుడు మల్లికార్జునరావు

నెల్లూరు(బృందావనం): 'వార్డు నంబర్–54' సినిమా ఆడియో లాంచ్ కార్యక్రమం నెల్లూరు వీఆర్సీ మైదానంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు జరుగనుందని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, చిత్ర దర్శకుడు పిన్నమరాజు మల్లికార్జునరావు తెలిపారు. నెల్లూరు ట్రంకురోడ్డు గాంధీబొమ్మ దగ్గర ఉన్న 25 కళాసంఘాల చాంబర్‌లో ఆ చిత్ర బ్రోచర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నెల్లూరు ప్రాంతం ఎన్నో రమణీయ దృశ్యాలకు నెలవు అని, అందుకే నెల్లూరు పరిసరాల్లో సినిమాలోని కొంత భాగం షూటింగ్ జరుపుకుందన్నారు. అనంతరం చిత్ర దర్శకుడు మల్లికార్జునరావు మాట్లాడుతూ స్థానిక వీఆర్సీ మైదానంలో జరిగే ఆడియో ఫంక్షన్‌కు ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, వకీల్‌సాబ్ ఫేమ్ అనన్య ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. మనమందరం భారతీయులమని, తమది భరతజాతి అనే ఇతివృత్తంతో తెరకెక్కిన ఈ చిత్రానికి సంగీత దర్శకులుగా అజయ్ పట్నాయక్, ప్రవీణ్ వ్యవహరించారన్నారు. హీరో హీరోయిన్లుగా శివప్రసాద్, వైష్ణవి సింగ్, ప్రతినాయకుడిగా చాపల కిరణ్ నటించారన్నారు. కార్యక్రమంలో 54వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ప్రసాద్, 25 కళాసంఘాల కన్వీనర్లు అమీర్‌జాన్, దోర్నాల హరిబాబు, నేదురుమల్లి హరనాథ్‌రెడ్డి, చిత్ర నటీనటులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై గ్రామసభ



గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

మనుబోలు: మండలంలోని వీరంపల్లి పంచాయతీ పరిధిలో గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై శనివారం ఆ సచివాలయంలో సర్పంచ్ సుధాకర్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఇందులో గత ఆర్థిక సంవత్సరంలో గ్రామ పరిధిలో ఎంతమంది కూలీలు ఏఏ పనులు చేశారో ఉపాధి సిబ్బంది వివరించారు. అయితే దీనిపై కొందరు గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. చాలాచోట్ల అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. గ్రామంలో లేని వారు, పనులకు వెళ్లని వారి పేర్లు కూడా మస్టర్లలో నమోదు చేసి నగదు డ్రా చేశారని వివరించారు. ఇలా దాదాపు 100 పనిదినాలకు రూ.20 వేలు చెల్లించారన్నారు. అవకతవకలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఏపీఓ రాజమ్మ వివరణ ఇస్తూ ఉపాధి పనులు, కూలీల హాజరుకు సంబంధించిన రికార్డులన్నీ సక్రమంగా ఉన్నాయన్నారు. గ్రామసభలో ఎంపీటీసీ సభ్యుడు రాగయ్య, ఏఎంసీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఎస్‌ఆర్‌పీ వెంకయ్య, డీఆర్‌పీ ఆర్‌బీ రమణ, టీఏ సుప్రజ, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కోడూరుపాడు సొసైటీకి పురస్కారం



మంత్రి కాకాణి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సొసైటీ సీఈఓ శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ : రైతులకు ఉత్తమ సేవలు అందించడంతో పాటు లాభాల బాటలో అగ్రగామిగా నిలిచిన రూరల్ మండలంలోని కోడూరుపాడు శ్రీకోదండరామస్వామి సహకార సొసైటీ ఉమ్మడి నెల్లూరు జిల్లాలో తృతీయ స్థానంలో నిలిచింది. దీంతో విజయవాడలో శుక్రవారం జరిగిన ఆప్కాబ్ వజ్రోత్సవ కార్యక్రమంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా సొసైటీ సీఈఓ బి.శ్రీధర్‌రెడ్డి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ సొసైటీ చైర్‌పర్సన్ నడవాటి వెంకటేశ్వర్లు, పాలకమండలి సభ్యులు మస్తానయ్య, గంగి కృష్ణారెడ్డితో పాటు రైతుల సహకారంతో సొసైటీ ఎనలేని అభివృద్ధిని సాధించినట్లు తెలిపారు. రైతులకు సకాలంలో సేవలు అందించడంతో పాటు రుణ రికవరీలు సజావుగా జరగడంతో ఉత్తమ అవార్డు దక్కిందన్నారు.

15 నుంచి నగదు రహిత లావాదేవీలు



ఎస్‌బీఐ అధికారులతో మాట్లాడుతున్న ఈఓపీఆర్‌డీ ప్రసాద్

మనుబోలు: ఈ నెల 15 నుంచి పంచాయతీల్లో నగదు రహిత లావాదేవీలను ప్రారంభిస్తామని పంచాయతీ విస్తరణాధికారి ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మనుబోలులోని తన కార్యాలయంలో నగదు రహిత లావాదేవీలపై ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ ప్రియదర్శిని, పంచాయతీ కార్యదర్శులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై పంచాయతీల్లో పన్ను చెల్లింపులు ఫోన్‌పే క్యూఆర్ కోడ్ ద్వారా జరపాలన్నారు. 3 వేల లోపు జనాభా ఉంటే క్యూఆర్ కోడ్, అంతకన్నా ఎక్కువ ఉంటే పీఓఎస్ డివైస్ ద్వారా లావాదేవీలు జరపాలని తెలిపారు. ఇందుకోసం అన్ని పంచాయతీల్లో ఎస్‌బీఐ కరెంట్ అకౌంట్‌ను ప్రారంభించాలని సూచించారు.

ఎల్లప్పుడూ న్యాయ సహకారం అందిస్తాం

• జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి



చిన్నారులకు అల్పాహారం అందజేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వాణి

నెల్లూరు(బృందావనం) : బాలలు, వృద్ధులకు న్యాయపరంగా ఎల్లప్పుడూ పూర్తి సహకారం అందిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని ఆదేశాల మేరకు నెల్లూరు నగరంలోని వనంతోపు సెంటర్‌లో ఉన్న జనహిత వాత్సల్య, వానప్రస్థ వృద్ధుల ఆశ్రమాన్ని ఆమె శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా బాలల హక్కులు, బాధ్యతలతో పాటు భారత రాజ్యాంగ ప్రాధాన్యతను చిన్నారులకు వివరించారు. ఆశ్రమంలో బాలల భోజన, వసతి సదుపాయాలు, ఆరోగ్య పరిస్థితులు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధుల యోగక్షేమాలు ఆరాతీశారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి మాట్లాడుతూ తల్లిదండ్రులను, కుటుంబంలోని వృద్ధులను వారి సంతానం, రక్త సంబంధీకులు నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. తొలుత బాలలు, వృద్ధులకు అరటిపండ్లు, బిస్కెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ కార్యనిర్వాహక కార్యదర్శి జీవీ సాంబశివరావు, వార్డెన్ గిరి, హెచ్‌ఎం మధుసూదన్‌రెడ్డి, లీగల్ వలంటీర్ ఎం.పెంచల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

• డీఎంహెచ్‌ఓ పెంచలయ్య



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

వెంకటాచల: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య పిలుపునిచ్చారు. శనివారం ఆయన వెంకటాచలంలోని మండల పరిషత్ కార్యాలయంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 10వ తేదీన జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని అన్నిచోట్ల విజయవంతం చేయాలని తెలిపారు. పాఠశాలల్లో 19 ఏళ్ల వయస్సు లోపు ఉన్న విద్యార్థులకు తప్పనిసరిగా నులి పురుగుల నివారణ మాత్రలు మింగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు



ట్రాఫిక్ ప్రత్యామ్నాయ చర్యలపై ఎస్సైతో చర్చిస్తున్న వీరి చలపతిరావు

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో సెంటర్ లైటింగ్ పనులు జరుగుతున్నందున ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నట్లు డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు తెలిపారు. నార్తురాజుపాళెం కూడలిలో జరుగుతున్న సెంటర్ లైటింగ్ పనులను ఎస్సై జి.సుబ్బారావు, డీటీ జి.మల్లికార్జునలతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంటర్ లైటింగ్ పనులు కూడలిలో జరుగుతున్నందున కొడవలూరుకు వెళ్లే వాహనాల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఓ వైపు రోడ్డు పనులు జరుగుతుంటే మరోవైపు కొడవలూరు నుంచి వచ్చే వాహనాలను పంపడం, కొడవలూరుకు వెళ్లే వాహనాలను గండవరం ఫ్లైఓవర్ బ్రిడ్జి సర్వీసు రోడ్డు మీదుగా వచ్చి నార్తురాజుపాళెం మీదుగానే కొడవలూరు వెళ్లేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని వ్యాపారులు, స్థానికులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, నాయకులు కొండా శ్రీనివాసులురెడ్డి, ఎండీ కరిముల్లా, ఎస్.మాణిక్యరావు, పి.మధుసూదన్‌రెడ్డి, సత్యంయాదవ్, జెల్లి కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

నెల్లూరు(వేదాయపాళెం) : 2022– 23 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన గాండ్ల, తెలికుల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ఆదివారం ఉదయం 10 గంటలకు అందజేయనున్నట్లు అఖిల గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు మినీబైపాస్ రోడ్డులోని మహేశ్వరి పరమేశ్వరి కల్యాణ మండపంలో జరిగే కార్యక్రమంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు జ్ఞాపికలను అందజేస్తామని తెలియజేశారు. గాండ్ల, తెలికుల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

నేడు జాషువా లైబ్రరీలో కార్యవర్గ సమావేశం

నెల్లూరు(మినీబైపాస్) : నగరంలోని పద్మభూషన్ గుర్రం జాషువా గ్రంథాలయంలో ఆదివారం మొదటి కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఏఎస్‌డబ్ల్యూఓ రిటైర్డ్ వైస్ ప్రెసిడెంట్, స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ కార్య నిర్వాహక అధ్యక్షుడు ఎస్‌కే ఖాసీం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో గ్రంథాలయ సమస్యల గురించి ప్రముఖులతో చర్చించి వారి సలహాలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమానికి సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

బాలల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(వేదాయపాళెం) : ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలల పురస్కారాలు–2023(పీఎంఆర్‌బీపీ)లకు అర్హులైన బాల, బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి బి.హేనా సుజన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడలు, సామాజిక, సేవా రంగం, ధైర్య సాహసాలు, నూతన ఆవిష్కరణలు, పర్యావరణ పరిరక్షణ, సాంస్కృతిక సాంప్రదాయాలు, శాస్త్ర సాంకేతిక విజ్ఞాన రంగాల్లో అత్యంత ప్రతిభ చూపిన 18 ఏళ్ల లోపు వారు ఈ నెల 31వ తేదీలోపు http://awards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.